కథానిక

# పరీక్ష ఫలితాలు

కె. వీరభద్రశాస్త్రి

స్కూలు ఫైనల్ పరీక్షలు అవగానే తల తడిమి చూసుకొన్నట్లుగా భారం వదలించుకొని రామం యింటికి బయల్దేరాడు. స్నేహితుడు శంకరం వచ్చాడు.

'ఏంగోయ్! యింటికి పోతున్నావేంరా? అని అడిగాడు శంకరం.

'మరి? ఇంకా ఆగమన్నావా ఏమిటి?'

'ఆగడం కూడా ఎందుకులే! ఈ బందిఖానాలోంచి ఎంత త్వరగా పోతే అంత హాయి! ఇంతకీ ఏ బండికి?'

'మధ్యాహ్నం మెయిలులో!'

'వెరీగుడ్! వుత్తరాలు రాస్తూవుంటావా!'

'ఓ తప్పకుండా! నువ్వు జవాబు వ్రాస్తానంటేనే!'

'ఎందుకు రాయనురా? ఇంతకీ మన రిజల్ట్సు ఎప్పుడు పడతాయంటావు?'

రామం ఉలిక్కిపడి 'పోనియ్యరా! వెధవ రిజల్ట్సు! వాటి సంగతి యిప్పుడు ఎత్తకు! తర్వాత చూద్దాం!'

'ఏం యీవేళ సోషల్ స్టడీస్ సరిగ్గా రాయలేదేమిటి?'

'ఏదో వ్రాసారా! ప్యాస్ మార్కులు రావచ్చు!'

ఐతే రిజల్ట్సు అంటే భయపడ్తావేం?'

'భయం! నువ్వు చెప్పేదీ మరీ బాగుందురోయ్! యిది పబ్లిక్ పరీక్షగదా! మన స్కూలు మేష్టర్లు దిద్దేమాటైతే ఫరవాలేదు! ఎవరి దగ్గరకో వెళ్తాయి!'

'ఆ! గాడిదగుడ్డు! బాగావ్రాస్తే ఎవరిదగ్గరకు వెళ్తేమాత్రం భయం ఎందుకురా?'

'అల్లా అనకు! మన మేష్టర్లు చెప్పిన పద్ధతి యింకో స్కూలు వాళ్లకి నచ్చకపోవచ్చు! అయినా ఆపూసు యిప్పుడు ఎందుకురా బాబూ! నిన్నటిదాకా చదువుకోవడంలో హైరానా అయిందా! ఈవేళనుంచీ ఫలితాలు అంటూ మనస్సు పాడు చేసుకోనడం ఎందుకురా!'

'సర్లే! వస్తారా!'

'టా! టా!'

◆ ◆ ◆

రామం మెయిల్‌లో ఎక్కి కూర్చునే సరికి ఎంతో అవస్థ అయింది. అబ్బ! ఏం రష్! ఇంతమంది జనం ఎందుకు ప్రయాణం చేస్తారో!! వీళ్ళందరికీ నిజంగా అవసరంవుండే వెళ్తున్నారా! కర్చీఫుతో మొహం తుడుచుకొని కిటికీలోంచి బయటకు చూసాను. పత్రికలు అమ్మే కుర్రవాడువస్తే, వారపత్రిక, వారప్రభ కొన్నాడు. ఇంతలోకే ఎదురుగా బల్ల మీద కూర్చున్న యిద్దరు విద్యార్థుల మాటలు అతన్ని ఆకర్షించాయి.

'కాంపోజిట్ మేథమిటిక్స్ 120 కి వాల్యూ చేసి, 100 కి వేస్తు 10% కలుపుతారుట!'

(రామానికి అర్థంకాక చూస్తాడు)

'అయితే వాల్యూయేషన్ కష్టంగా వుంటుందేమో!' (రామం బిత్తరపోతాడు)

'కష్టం ఏం వుంది? ఈ పద్ధతిలోనే చాలా మంది ప్యాసవుతారు! దీనివల్ల మనకు మేలే! (రామం మొహం విప్పారుతుంది)... ఇంకోటి విన్నావా? ఇంగ్లీషు, సోషల్ స్టడీస్ కూడా లిబరల్‌గా దిద్దమని ఆర్డర్సు వచ్చాయిట

(రామం ఆ కుర్రవాడికి మనస్సులో థాంక్స చెప్పుకొన్నాడు)

'పోనీలే! యీ సంవత్సరం మనం సక్కాని తొక్కామన్నమాటే!'

రామం ఆనందానికి గట్లు లేవు! పోనీలే! తను సోషల్ స్టడీస్ కొంచెం కష్టంగా వుందనుకున్నాను! అయితే తను ప్యాసవడానికి ఢోకా లేదు! హాయి హాయి! రామం మనస్సు ఆనందంతో ఉవ్విళ్లూరుతూంది! అది రైలు పెట్టె అయిందిగాని, లేకపోతే "మనసున మల్లెలు మాలలూగెనే" పాడకపోనా?

◆ ◆ ◆

రామం యింటికి చేరేసరికి సంధ్యాసం-టి అలుముకుంటూవుంది, అతని రాకకు ముందుగా పసికట్టింది అతని చిన్న చెల్లెలు శ్యామల.

'అన్నయ్యొచ్చాడే అమ్మా!' అంటూ వంటింట్లోకి పరుగెత్తింది. దానికేకలకు తల్లి యివతలికి వచ్చింది.

ఇంతలో రామం బండి వానికి డబ్బులు యిచ్చి, పెట్టె, బెడ్డింగు హాలులోకి తీసికొని వచ్చాడు.

'ఏరా నాయనా! పరీక్షలయినాయా?' అంది తల్లి.

'అయ్యా యమ్మా!'

'వంట్లో కులాసాగా వుంటోందా?'

'ఆ! నాన్నగారేరీ!'

'వస్తారు! కరణంగారింటికి వెళ్లారు. లే! నీళ్లు పోసుకో!'

ఇంతలో శ్యామల పరుగెత్తుకుంటూ వచ్చి 'అన్నయ్యా! మరేం! మన ఆవుకో బుల్లి తువ్వాయి పుట్టిందిరోయ్;'

'మన ఆవు యీనిందా అమ్మా?'

'అవునురా! మొన్ననే యీనింది! గిత్త దూడ!'

రామం చెల్లెలుతో పెరట్లోకి పరుగెత్తాడు.

రాత్రి తండ్రితో భోజనం చేస్తున్నాడు రామం.

'ఏరా పరీక్షలు బాగా రాసావా?'

'రాసావు !'

'పేసవుతావా ?'

'ఊఁ !'

'పోనీలే ! ఈవిషయం భీమవరంలో చదువుదువు గాని ! మామయ్యకు ట్రాన్సఫరు అయింది. భీమవరంలో వాళ్ళయింట్లోనే వుండి పి.యు.సి. చదువుదువు గాని !'

రామం మాట్లాడలేదు.

◆ ◆ ◆

రెండు నెలలు గిర్రున తిరిగాయి. మే నెల 29 వ తేదీ రామం పోస్టాఫీసుకు వెళ్ళాడు. శంకరం వుత్తరం వ్రాసాడు. జూన్ 2 వ తేదీ రిజల్ట్సు వస్తాయిట ! రామానికి గుండెల్లో దడలు పట్టుకొంది ... ఇంటికొస్తూవుంటే దారిలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం కనిపించింది. ఆలయంలోకి వెళ్ళాడు. ఒకసారి యిటూ అటూ చూసి, దణ్ణం పెడుతూ, 'స్వామీ నా పరీక్ష ప్యాస్ అవుతే రెండు కొబ్బరి కాయలు కొట్టాను' అని మనస్సులో మొక్కుకున్నాడు.

◆ ◆ ◆

జూన్ 2 వ తేదీని ఉదయం రామానికి మెలకువ వచ్చింది. అయినా కళ్ళు తెరవలేదు. 'అమ్మా !' అని పిలిచాడు. 'ఏం' అంటూ తల్లి దగ్గరకు వచ్చింది. రామం కళ్ళు తెరిచాడు. తల్లి కనిపించింది. ఇక ఫరవాలేదు ! అతని భయం వాళ్ళ దాసీ కనపడుతుందేమో నని అది తల చెడేది. ఉదయమే దాని మొహం చూస్తే అపశకునం అని భయం ! గబగబా లేచి మొహం కడుక్కున్నాడు. కాఫీ వగైరాలు పూర్తిచేసి సైకిలు మీద స్టేషన్‌కు వెళ్ళాడు... మెయిల్ గంటలేటుట ! అక్కడేవున్న బెంచీమీద కూర్చుని మెయిలు కోసం చూస్తున్నాను... చివరికి మెయిలు పొగలు గ్రక్కుకొంటూ వచ్చింది. ఆదుర్దాతో లేచాడు రామం ! మనస్సులో దైవప్రార్థన చేసుకొన్నాను. ఇంతలో పేపరు వాను వచ్చాను. హిందూకొన్నాడు ఎవరూ చూడకూడదని ప్లాటుఫారం చివరికివెళ్ళి దేము

(తరువాయి 22 వ పేజీ)

# జర్మనీలో ఆడవారిదే పైచేయి -
# - మగవారి వుద్యోగాల్లో ప్రవేశం

పశ్చిమ జర్మనీలో ఆడవారికి ఎంతో ప్రముఖమైన స్థానం వుంది. మగవారు చేసే కొన్ని ఉద్యోగాలకుకూడా ఆడవారు బాగా పనికి వచ్చారు.

ఫ్రాంక్‌ఫర్ట్ (డాడ్): అందమైన ఆడమ్మాయి చేతిలో కసాయివాని కత్తి వుంది. చూచేవారికే యీ దృశ్యం భయంకరంగా వుంటుంది.

ఏమిటిది ? అనుకొనేప్పుడు ప్రత్యేకించి చెప్పదగిన విశేషంలేదు. పశ్చిమ జర్మనీలో ఆడవారు యీమధ్య రోజుల్లో తమ వుద్యోగాల పరిధిని విస్తృతం చేసికొన్నారు. మగవారుచేసే కొన్ని వుద్యోగాలకుకూడా యీ ఆడవారు తయారవుతున్నారు

ఆడవారు అన్ని రంగాల్లోను వున్నారు. కాని, తమ అందచందాలను నిలబెట్టుకొంటూ, మగవారిలాగా సమానమైన హోదా సంపాదించటం ఎలా... తానే పట్టుదలకొద్దీ యీ కొత్త వుద్యోగాలకు వారు సిద్ధమయ్యారు.

మగవారు ఎన్నడోగాని కనిపించని కొన్ని వుద్యోగాల్లో కూడా పశ్చిమ జర్మనీ స్త్రీలు విరివిగా కనిపిస్తున్నారు. మగవారు చేయవలసిన వుద్యోగాలలోకూడా ఆడవారే యీనాడు పూర్తిగా వున్నారు. స్టేషన్‌లలో వుద్యోగాలకు, టాక్సీ డ్రైవర్ పదవులకు, మెకానిక్‌లుగాను, పోలీసులుగాను, రైళ్ళలో కండక్టర్లుగాను, ఆడవారే బాగా ప్రాబల్యం సంపాదించుకొంటున్నారు. ఇంకా వివరంగా చెప్పాలంటే, యీనాడు ఆడవారులేని వృత్తి లేదు. విజ్ఞానశాస్త్ర రంగంలో ఆడవారు కూడా ముందుకు వస్తున్నారు. కొత్త కొత్తగా రూపొందుతున్న సాంకేతిక పరికరాల తయారీకి, విజ్ఞాన శాస్త్రంలో కొత్త విషయాలు వెలుగులోకిరావటానికి ఆడవారుకూడా ఎంతో బాధ్యులు. 'ఇంజనీరింగ్' విభాగంలోకూడా ఆడవారి ప్రగతి ఆశ్చర్యకరంగానే వుంది. జీసెన్ అనే పట్టణంలో ఒక అమ్మాయి యీనాడు ఇంజనీరుగా పనిచేస్తున్నది మరో అమ్మాయి సహకార విక్రయశాలలో కసాయి పని చేస్తున్నది.

ఈ కసాయి పని చేసే చరిత్ర ఎంతో చిత్రంగా వుంటుంది. ఆమె తండ్రి కొంతకాలం క్రితం మరణించాడు. ఆ స్థానాన్ని ఆమె సోదరుడు తీసికొని విక్రయశాలలో వుండేవాడు. కాని, అకస్మాత్తుగా ఆ సోదరుడుకూడా యిల్లు విడిచిపోవలసి వచ్చింది. ఇక, ఆ బాధ్యతలను చూడవలసిన అవసరం ఆ అమ్మాయి మీదకే పడింది. ఈనాటకీ ఆ అమ్మాయి తన దుకాణాన్ని తెలివిగా నడుపుకొంటున్నది.

మొత్తంమీద, మగవారు చేసే వుద్యోగాలన్నింటికి ఆడవారుకూడా చేయగలరని తేలిపోయింది. 'దీనికంటే ముఖ్యంగా మేము మాచందచందాలను ఆలుపుకోవాలి' అన్నారు కొందరు.

ఉద్యోగ ధర్మం ప్రసక్తి వచ్చేసరికి, పశ్చిమ జర్మనీలో మగ, ఆడ అనే తేడా పూర్తిగా తొలగిపోతున్నది. (యు. పి. ఎస్.)

—గెర్టా—మేరియా షెఫ్లర్

## పరీక్ష ఫలితాలు

(8 వ పేజి తరువాయి)

తను మళ్ళీ ఒకసారి తట్టుకొని పేజీలు తిరగేసాను. ఎక్కడా రిజల్ట్సు లేవు! హమ్మయ్య! ఊపిరి పీల్చి నిమ్మదిగా యింటికి చేరాడు

ఏరా రిజల్ట్సు పడ్డాయా! తల్లి అడిగింది.

లేదు!

'ఇంకా పడలేదూ! యీ వేళ పడతాయన్నావు!'

రామం మాట్లాడకుండా యింట్లోకి వెళ్ళాడు.

మర్నాడు పొద్దున్నే రామం మెలుకువ రాగానే, తల్లి మాట్లాడే వైపు తిరిగి కళ్లు తెరిచాడు... ఆ! ఇంక ఫరవాలేదు! కాస్త సంతృప్తిపడ్డ హృదయంతో కాలకృత్యాలు తీర్చుకొని స్టేషన్‌కు నెమ్మదిగా బయల్దేరాడు. అప్పటికే మెయిల్ వచ్చేసింది. ఒక ప్రయాణీకుని చేతిలో పేపరు వుంది...

'S. S. L. C. రిజల్ట్సు వున్నాయా సార్!'

లేవు

♦ ♦ ♦

5 వ తేదీ వచ్చింది. ఆనాడు రాము వీధిలోకి కాలు పెట్టగానే పక్కనించి పిల్లి పారిపోయింది. ఎదురుగా డాబామీద ఎవరో అమ్మాయి కూర్చుని వుంది. ఇంట్లోకి వెళ్దామనుకొని, ఆ అమ్మాయి కవి పెట్టి శకునం చేసిందని సందేహించారు. ఇంకో వైపు భయం అయినా పిల్లి ఎదురుగా రాలేదుగదా! ఫరవాలేదు! స్టేషన్ దగ్గరకు వచ్చేసరికి మెయిలు వచ్చేసింది. హడావిడిగా వుంది.

'రిజల్ట్సు పేపరు అణా!' అంటూ కుర్రాడు పేపరు అమ్ముతున్నాడు.

'అరే! రిజల్టు పడ్డాయా! మనస్సులో ఏదో తెలియని బాధ వచ్చింది. పిల్లి మాట జ్ఞాపకం వచ్చింది. పరీక్ష ఏమౌతుందో! చెప్పుల్లోంచి కాళ్లు జారిపోతున్నాయి.

ఒక అణా యిచ్చి పేపరు కొన్నాడు. ఆఖరు పేజీలో ఆంధ్ర విశ్వవిద్యాలయము అని కనపడింది. మనస్సులో దేముణ్ని స్మరించుకొని మళ్ళీ చూసాను. పి. యు. సి పరీక్షా ఫలితాలు అనివుంది.' అరే! పి. యు. సి. వస్తే మాట!' తేలికపడ్డ హృదయంతో యింటికి వెళ్ళాడు.

♦ ♦ ♦

జూన్ 10 వ తేదీ వచ్చింది. ఇంతవరకు రిజల్ట్సు పడలేదు. ఎంత కర్మం! పెందరాళే పడితే, కాలేజీలో చేరవచ్చును గదా! రూఢి అయిన వార్త తెలిసింది 14వ తేదీని పడ్తాయని.

జూన్ 13 వ దీని ఉదయం రామం లేస్తు వుండగా 6 గంటలు కొట్టింది. శ్యామలవచ్చి 'ఒరే అన్నయ్యా! లేరా! ఈవేళ సత్యానికి వడుగు. పెందరాళే వెళ్దాం! అంది. అవును! సత్యం వడుగుగా! శ్యామల అప్పుడే ముస్తాబై రెడీగా వుంది! తనే ఆలస్యం! గబ గబా లేచి కాలకృత్యాలు తీర్చుకొని శ్యామలతో వడుక పెళ్ళి వారి యింటికి వెళ్లాడు. సత్యం వడుగు అవును వుంది. వాడు ప్రతివాళ్ళ దగ్గరికీ వెళ్ళి దణ్ణం పెట్టి భిక్ష అడుగుతున్నారు. వెండి గ్లాసులు, వుండడం, రూపాయలు భిక్ష వేస్తున్నారు... తనక్కూడా వడుగు కావాలి అవుతే!

'హీరోయ్! రామం ఇక్కడ వున్నావా! నువ్వు ప్యాసయ్యావురా! అంటూ వచ్చాడు రామం మేనమామ! రామం ఉలిక్కిపడ్డాడు. 'నిజం!' మరి రేపు పడతాయన్నారే! నిజమేనా మామయ్యా!

'నిజంరా! ప్రభలో పడ్డాయి! స్టేషను దగ్గరగా పేపరు ఎవరోకొంటే, నీ నెంబరు చూసా!

రామం వాయువేగంతో స్టేషన్కు పరిగెత్తాను. అతికష్టంమీద ఒక పేపరు దొరికింది. నిజమే! రిజల్ట్సు పడ్డాయి! తన నెంబరు వుంది! ఆనందంతో రామం యింటికి వస్తు వుంటే దారిలో శ్రీ ఆంజనేయస్వామి గుడి కనపడింది. లోపలికి వెళ్ళి మనసారా దణ్ణం పెట్టి గాలిలో తేలిపోతున్నట్లువున్న శరీరంలో ప్యాసయినానన్న గర్వంతో వడుక పెళ్ళివారింటికి బయల్దేరాడు రామం! కాబోయే పి. యు. సి. విద్యార్థి.

---

## జాతి కోసం!

రచన: తాగళ్ల పాండురంగశర్మ

జీవిస్తాను యీ జగతిలో
జాతి జీవించినంత కాలం...!
యుగాలు మారినా... నాకు
తరాలు మారినా... నేను
జీవిస్తాను యీ జగతిలో
జాతి జీవించినంత కాలం...!!
ఆరగ్నాలకోసం జీవించేవ్యక్తి
అన్ని సందర్భాల్లో ఓడిపోతాడు!
ఆత్మవంచనకోసం ప్రయత్నిస్తే
అన్నిరంగాలలో గెలుస్తాడు...!
ఇదికాలమహిమప్రభావమా...?
కాదు
పరిస్థితులప్రభావంప్రకోపించింది!
కరుడు గట్టిన హృదయాలకు
చైతన్యం కలగాలంటే... నీకు
నీవు నీతిగా నిలబడు... నీకు
నీవు నమ్మకంగా నిలబడు... నిన్ను
చూచి నేర్చుకోవాలి లోకం... నీకు
నీవే ఆదర్శవ్యక్తిగా నిలబడు...!!
అన్నీ నైతిక పతనంచెందుతోంటే
ఆపదోద్ధారకుడుద్భవిస్తాడంటారు
అనంత జ్ఞాన జ్యోతిని... అతడు
ఆప్యాయంగాఅందిస్తాడు.. అతడు
అన్నిటికీకారణభూతుడు... అతడు
అందరికీఆదర్శమయస్వరూపుడు!
మహనీయు లుద్భవించిన ఈజగతిలో
మహోపద్రవాలకు తావు లేదు...!
మనజాతి మనధర్మ మనినంతకాలం
మానవుడిగా జీవిస్తాను ఈ జగతిలో!
మానవాళి మనుగడకై ఈ జగతిలో
జీవిస్తాను జాతి జీవించినంత కాలం!!

—